క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

సీఐ రాజశేఖర్



మాడ్గుల: ప్రజలందరూ ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని మాడ్గుల సీఐ రాజశేఖర్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ బలగాల కవాతు, పాత నేరస్తులను బైండోవర్ చేయడంతో పాటు సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రతి ఒక్క ఓటర్ స్వేచ్ఛగా ఓటేయాలన్నారు. ఎవరైనా అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. శాంతియుత వాతవరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు.

ఎన్నికల సిబ్బందికి రెండురోజుల శిక్షణ

ఇబ్రహీంపట్నం: శేరిగూడ సమీపంలోని శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో శని, ఆదివారాల్లో పీఓ, ఏపీఓలకు 3వ విడత శిక్షణ ఇవ్వనున్నట్లు ఇబ్రహీంపట్నం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. అదేవిధంగా అదే సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఎన్నికల సిబ్బంది వేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల విధి నిర్వహణలో పాల్గొనే ఇతర సిబ్బందికి శని, ఆది, సోమవారాల్లో, పోలీస్ వ్యక్తిగత సిబ్బందికి ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసేందుకు ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిక



మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన హైమావతి

ఇబ్రహీంపట్నం: ముకునూర్ గ్రామానికి చెందిన మలిదశ తెలంగాణ ఉద్యమకారిణి ఇటికాల హైమావతితోపాటు పలువురు శుక్రవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి ఆమెకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు అన్యాయం చేసిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, రేషన్‌కార్డులు, దళితబంధు ఇవ్వని బీఆర్ఎస్ పార్టీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దాసు, గుత్తా రాజశేఖర్‌రెడ్డి, కరుణాకర్, లక్ష్మారెడ్డి, ప్రదీప్‌గౌడ్‌తోపాటు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల రికవరీ



రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అందజేస్తున్న సీఐ గోవింద్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: మొబైల్ ఫోన్లు చోరీకి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇబ్రహీంపట్నం సీఐ గోవింద్‌రెడ్డి తెలిపారు. ఇటీవల చోరీకి గురైన, పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులైన నాగరాజు, శివకు శుక్రవారం అందజేశారు. సీఐ మాట్లాడుతూ.. రాష్ట డీజీపీ అంజనీకుమార్ అందుబాటులోకి తీసుకొచ్చిన సీఈఐఆర్ యాప్‌తో మొబైల్‌ఫోన్ల రికవరీ సులభతరమైందన్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైన మొబైల్ ఫోన్లను చాలా వరకు 20 రోజుల్లోనే రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఈ ఫోన్ల రికవరీకి కృషిచేసిన డీఐ బబ్యా నాయక్, కానిస్టేబుల్ విత, బాబూరావు, క్రైమ్ స్టాఫ్ నగేష్, కోటేశ్వర్‌రావును ఆయన అభినందించారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

బీజేపీ నాయకుడు లక్ష్మణ్

తుక్కుగూడ: ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలోని తుక్కుగూడలో నిర్వహించే బీజేపీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తుక్కుగూడ మున్సిపాలిటీ ఆ పార్టీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం తుక్కగూడలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ శనివారం మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌ను గెలిపించడానికి నిర్వహిస్తున్న బహిరంగ సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, పార్టీ జాతీయ, రాష్ట్ర నేతలు హాజరవుతారని తెలిపారు. సాయత్రం 4 గంటలకు నిర్వహించే ఈ సభకు మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమన్నారు. కమలం గుర్తుకు ఓటేసి మద్దతు తెలపాలన్నారు.

మరోసారి ఆశీర్వదించండి



పెద్దఅంబర్‌పేట్: ఓటర్లకు నమస్కరిస్తున్న కిషన్‌రెడ్డి



మంచాల: ప్రచారంలో మౌనికారెడ్డి, నాయకులు

మరింత అభివృద్ధి చేస్తా

- బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

హయత్‌నగర్: గత పదిహేనేళ్లలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని కళానగర్, పస్మాముల, కుంట్లూర్, తట్టిఅన్నారం, మర్రిపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత ఐదేళ్లలో నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ఎమ్‌కేఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. మరోసారి కారు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌కుమార్, దండెం రాంరెడ్డి, రాజుగౌడ్ పాల్గొన్నారు.

మంగళపల్లి, పోచారంలో..

ఇబ్రహీంపట్నం రూరల్: మహిమలు గల తల్లి మహమ్మాయిదేవి మా మామయ్యను గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోడలు మౌనికారెడ్డి వేడుకున్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లిలో గల మహమ్మాయిదేవికి శుక్రవారం ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. అనంతరం మంగళ్‌పల్లిలో ప్రచారం నిర్వహించారు. కారుగుర్తుకు ఓటు వేసి తన మామ మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగయ్య, రవీందర్‌రెడ్డి, జగదీశ్, వెంకటేష్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారంలో ఎంపీపీ కృపేశ్, మహిళా అధ్యక్షురాలు మాధవి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు ప్రచారం నిర్వహించారు. నాయకులు కృష్ణ, భారతి తదితరులు పాల్గొన్నారు.

మంచిరెడ్డితోనే అభివృద్ధి సాధ్యం

యాచారం: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మాల్, అయ్యవారిగూడెం, చింతుల్ల, యాచారం, నందివనపర్తి, నక్కర్త మేడిపల్లి, తాడిపర్తి తదితర గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రానే గుర్తుకు ఓటువేసి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాశ్చభాష తదితరులు పాల్గొన్నారు.

నోములలో ఇంటింటి ప్రచారం

మంచాల: బీఆర్ఎస్ ఇబ్రహీంపట్నం అభ్యర్థి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కోడలు మంచిరెడ్డి మౌనిక ప్రశాంత్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మంచాల మండలం నోములలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కృషి చేశారని తెలిపారు. కారుగుర్తుకు ఓటువేసి తన మామ మంచిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలరాజ్, మాజీ సర్పంచ్ దండేటికార్ మేఘన, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దండేటికార్ రవి, నాయకులు చక్రపాణి, హన్మంత్, వీరేష్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

గౌరెల్లిలో ప్రచారం

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ అబ్దుల్లాపూర్‌మెట్‌లోని గౌరెల్లిలో ఎంపీటీసీ గ్యార బాలలింగస్వామి, ఉపసర్పంచ్ వేముల చంద్రశేఖర్ శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈవీఎం నమూనాతో ప్రతి ఇంటికీ తిరుగుతూ ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి మంచిరెడ్డిని 4వసారి గెలిపించాలని ఓటర్లను కోరారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, పరమేష్, నర్సింగ్‌రావు, వేముల రమేష్, శివకుమార్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

పార్టీ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి

- హస్తం గుర్తుకు ఓటేయాలని విస్తృత ప్రచారం



ఆమనగల్లు: వృద్ధురాలికి ఆరు గ్యారెంటీలను వివరిస్తున్న కసిరెడ్డి

ఆమనగల్లు: పేద ప్రజలకు అండ.. కాంగ్రెస్ జెండా.. అని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కల్వకుర్తి, ఆమనగల్లు మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం కసిరెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. నియంత, అవినీతి పాలన సాగిస్తున్న కేసీఆర్‌ను గద్దె దింపడమే తమ లక్ష్యమన్నారు. తనను ఆశీర్వదిస్తే కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాన్ని విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కల్వకుర్తి పట్టణంలోని వివిధ మసీదుల వద్ద ముస్లిం మైనార్టీలను కలసి హస్తం గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. అలాగే ఆమనగల్లు పట్టణంలో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మానయ్య, జంగయ్య, కేశవులు, మల్లయ్య, ఖాదర్, కృష్ణనాయక్, సత్యం, శ్రీశైలం, అలీం, నాసర్, ఫరీద్, షర్ఫుద్దీన్, శ్రీకాంత్, కరీం తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలకు అద్భుత రెస్పాన్స్

తలకొండపల్లి: వెనుకబాటుకు గురైన కల్వకుర్తిని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టంచేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు రాష్ట్రవ్యాప్తంగా మంచి రెస్పాన్స్ వస్తోందన్నారు. హస్తం గుర్తుకు ఓటువేసి తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు డేవిడ్ రేణురెడ్డి, రాజశేఖర్, యాదయ్య, వెంకట్రాంరెడ్డి, రాజిరెడ్డి, దశరథం, మహేశ్, దామోదర్, వెంకట్‌రెడ్డి, పవన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కర్కల్‌పహాడ్‌లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం పలువురు నాయకులు హస్తంగూటికి చేరారు. రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరినవారిలో అంజనేయులు, గణేశ్, శివ, వంశీ, దయాకర్, విజేందర్, జగన్, రామకృష్ణ, జితేందర్, అస్లమ్, రమేశ్, ఫారుఖ్, నర్సింహ, వెంకటేశ్, జానీ, శేఖర్, జాకీర్, ఆమీర్, సమీర్, రాహుల్, మహేశ్, కరుణాకర్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వరప్రసాద్ రెడ్డి, నాయకులు శ్రీరాములు, కరుణాకర్, కృష్ణయ్య, శ్రీను, శివరాజ్, సయ్యద్, జలాలుద్దీన్, రాజు, యాదగిరి, సైకిలాబ్, అంజనేయులు, వీరయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు పట్టం కట్టండి

- ఇబ్రహీంపట్నంలో నేతల ఇంటింటి ప్రచారం
- మల్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి



ఇబ్రహీంపట్నం: ఓటర్లకు డమ్మీ ఈవీఎంలో మల్‌రెడ్డి గుర్తును చూపిస్తున్న నాయకులు



తుర్కయంజాల్: ఆరు గ్యారెంటీలను వివరిస్తున్న అనురాధ, నాయకులు

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నేతలు ఓటర్లను కోరారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ సీనియర్ నేత బర్ల జగదీష్‌యాదవ్, బాల్‌రాజ్, రాజు, రాఘవేందర్, శశిధరప్ప, గౌస్, నరహరి ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలంగాణలో అవినీతి పాలన చేస్తున్న కేసీఆర్‌ను గద్దె దించాలని ఈ సందర్భంగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే వంట గ్యాస్ తదితర ఆరు గ్యారెంటీల గురించి ప్రజలకు వివరించారు.

డమ్మీ ఈవీఎంలతో ప్రచారం

డమ్మీ ఈవీఎంలను ఇంటింటికి తీసుకెళ్లి ఓటర్లకు చూపెడుతూ ఓటు ఏ విధంగా వేయాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వివరించారు. తమ అభ్యర్థి నంబర్, గుర్తు, పేరు తదితర వివరాలను వారికి తెలియజేశారు. కప్పరి రాజు ఆధ్వర్యంలో పలు వార్డుల్లో పర్యటించి మల్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు.

దండుమైలారంలో...

దండుమైలారంలో కాంగ్రెస్ పార్టీ నేతల ఇంటింటి ప్రచారం ఊపందుకుంది. పింఛన్‌దారులను ప్రత్యేకంగా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన కుటుంబసభ్యులందరికీ పింఛన్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆ పార్టీ నాయకులు మల్లేష్, హరినారాయణ పాల్గొన్నారు.

మల్‌రెడ్డిని గెలిపించండి

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ శుక్రవారం తుర్కయంజాల్‌లోని మసీద్ వద్ద ప్రచారం నిర్వహించారు. మైనార్టీలు, అన్నివర్గాల వారు కాంగ్రెస్‌కు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఆమె తెలిపారు. మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దర్శన్, నాయకులు శివకుమార్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో ఇంటింటి ప్రచారం

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆ పార్టీ ఇబ్రహీంపట్నం అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని నేతలు కోరారు. యాచారం, తక్కళ్లపల్లితండా, నల్లవెల్లి, మాల్, మల్కీజ్‌గూడ తదితర గ్రామాల్లో నమూనా బ్యాలెట్ పత్రాలతో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు జరిగి నిరుపేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. హస్తం గుర్తుతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. హస్తం గుర్తుకు ఓటువేసి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జహంగీర్, శ్రీనివాస్, గాలయ్య, శ్రీనువాస్‌నాయక్, నందునాయక్ పాల్గొన్నారు.

సేవకుడిలా పనిచేస్తా



ఆమనగల్లు: ఆచారికి పూలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

బీజేపీ కల్వకుర్తి అభ్యర్థి ఆచారి

ఆమనగల్లు: ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ఐదేళ్లపాటు ప్రజలకు సేవకుడిలా పనిచేస్తానని కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి అన్నారు. ఆమనగల్లు మండలంలోని మేడిగడ్డతండా, శంకరకొండతండాలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదుసార్లు పోటీచేసి ఓడిపోయినా 25 ఏళ్లుగా ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నానని చెప్పారు. ఆరవసారి పోటీచేస్తున్న తనను ప్రజలు ఆదరించాలని కోరారు. ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకువస్తానని చెప్పారు. కమలం గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మేడిగడ్డతండా సర్పంచ్ అమర్‌సింగ్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ముస్తాబు



మైసిగండి మైసమ్మ ఆలయం

- 27నుంచి మైసిగండి ఆలయ జాతర ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన సిబ్బంది

కడ్తాల్: కడ్తాల్ మండలం మైసిగండిలో కొలువై ఉన్న మైసిగండి మైసమ్మ ఆలయ జాతర ఉత్సవాలు ఈనెల 27 నుంచి ఆరురోజుల పాటు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ సిబ్బంది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జరిగే మైసమ్మ జాతరకు జిల్లా నుంచే కాకుండా తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై మైసిగండి ఆలయం ఉండటంతో ప్రతి నిత్యం భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. ప్రత్యేకించి ఆది, మంగళ, గురువారాల్లో వేల సంఖ్యలో అమ్మవారి దర్శనానికి భక్తులు వస్తుంటారు. జాతర ఉత్సవాల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. జాతరను పురస్కరించుకుని ఆలయాన్ని రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈఓ స్నేహలత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రవాణా సదుపాయం..

హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో మైసిగండి మైసమ్మ ఆలయం ఉంది. హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచి ప్రతి 5 నిమిషాలకు ఈ ఆలయం వద్దకు చేరుకునేందుకు బస్సు సౌకర్యం కలదు. అదే విధంగా నల్లగొండ ఎక్స్ రోడ్, ఐఎస్ సదన్, సంతోషనగర్, చంద్రయాణగుట్ట నుంచి ప్రతి 10 నిమిషాలకు బస్సులు కలవు. కల్వకుర్తి, నాగర్ కర్నూల్, అచ్చంపేట్ నుంచి కూడా ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉందని నిర్వాహకులు తెలిపారు.

కేఎల్లార్ విజయం ఖాయం

- మహేశ్వరంలో కాంగ్రెస్ నేతల ప్రచారం



మహేశ్వరం: రఘుమారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

మహేశ్వరం: మహేశ్వరంలో గడ్డపైన కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి ధీమావ్యక్తం చేశారు. కేఎల్లార్‌ను భారీ మెజార్టీతో గెలిపించి సోనియాగాంధీకి కానుకగా ఇస్తామన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఘట్టుపల్లి గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని తెలిపారు. అధికారంలోకి వస్తే రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15వేలు పంట పెట్టుబడి సాయం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షల సాయం, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని తెలిపారు. బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో గోసుల హనుమంతరెడ్డి, గోసుల వెంకట్‌రెడ్డి, గోసుల చంద్రశేఖర్‌రెడ్డి, కావలి శేఖర్‌తో పాటు పలువురు ఉన్నారు. కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్, ఎండీ సాబీర్, యాదగిరి పాల్గొన్నారు.

కందుకూరు మండలంలో..

కందుకూరు: కేఎల్లార్ గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు మండలంలోని పులిమామిడి, ధన్నారం, చిపల్లపల్లి, మురళీనగర్, దావుద్‌గూడ, పెద్దమ్మతండా తదితర గ్రామాల్లో గడప గడపకూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణా నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్యారెంటీలను అమలు చేస్తామని తెలిపారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కేఎల్లార్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు మల్లేశ్, పాండురంగారెడ్డి, సత్యానారాయణ, కృష్ణ, జగన్, సిద్దేశ్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

బడంగ్‌పేట్: హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్)ను గెలిపించాలని ఆయన సతీమణి విజయలక్ష్మి అభ్యర్థించారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్, వెంకటాపూర్, బాలాజీనగర్, గుర్రంగూడ, అల్మాస్‌గూడలో పీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగురింత పారిజాత దంపతులతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహేశ్వరంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. హస్తం గుర్తుకు ఓటేసి కేఎల్లార్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు.